క్లుప్తంగా

లీగల్ సర్వీసెస్ అథారిటీ కరపత్రాల ఆవిష్కరణ



బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ కరపత్రాలను సోమవారం సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి ఆవిష్కరించారు. కుటుంబ, సీనియర్ సిటిజన్, గ్రామీణ తగాదాలను లీగల్ అథారిటీ ద్వారా త్వరగా ఉచితంగా పరిష్కరించుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరిగి సమయం డబ్బులు వృథా కాకుండా చూడాలన్నారు. బాన్సువాడ కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో వలంటీర్లు అయ్యాల సంతోష్, పుష్పవతి, అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న హోంగార్డులకు సన్మానం



కామారెడ్డి క్రైం: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పని చేసి బదిలీపై వెళ్తున్న హోంగార్డు లను సోమవారం ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ.. పట్టణ పీఎస్‌లో కొన్ని సంవత్సరాలుగా పని చేసిన హోంగార్డులు మురళి, బాలరాజు, రాజిరెడ్డి, బషీర్, ప్రభాకర్, అక్తర్, మైసయ్య లు ఇతర పీఎస్ లకు బదిలీ అయినట్లు తెలిపారు. ఇక్కడ పని చేసిన కాలంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని వారిని అభినందించారు. హోంగార్డులకు శాలువా లతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై మహేశ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మాజీ జెడ్పీటీసీ గయాజుద్దీన్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో వర్షం తడుస్తూ పడుకున్న అనాథను మాజీ జెడ్పీటీసీ గయాజుద్దీన్ ఆదుకుని మానవత్వం చాటుకున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన వర్షంలో తడుస్తు పడుకున్న అనాథను గయాజుద్దీన్ అక్కడి నుంచి ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యం అందించారు. అనంతరం ఆమెకు దుప్పట్లు అందజేశారు. ఆయనతో పాటు బీఎస్పీ నాయకులు సాయిబాబా సైతం తోడుగా సహాయం చేశారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన



రాజంపేట : భూభారతి రెవెన్యూ సదస్సుపై తమకు సమాచారం ఇవ్వలేదని, ఒక్కరోజులోనే సభ పెట్టి చేతులు దులిపెసుకున్నారని రైతులు రెవెన్యూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం రైతులు ఆందోళన చేపట్టారు. ఈనెల 3వ తేదీన రాజంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతి రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేసి చేసి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ విషయంపై తమకు పూర్తిగా సమాచారం అందలేదని, భూ సమస్యలు ఎక్కువ ఉన్న రాజంపేటలో సమాచారం లేకుండా సభలు ఎలా నిర్వహిస్తారని రైతులు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. గతంలో పని చేసిన అధికారులు సరిగా పనులు చేయకపోవడం, ఇచ్చిన ఫిర్యాదులను సైతం పక్కన పెట్టేయడం నిర్లక్ష్యం వహించారని తమ సమస్యలు చెప్పుకోవడానికి మరో తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈవిషయమై తహసీల్దార్ జానకి మాట్లాడుతూ గ్రామసభలు నిరంతర ప్రక్రియ అని రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని సూచించారు. రైతులను సముదాయించడంతో వారు వెనుతిరిగారు.

మంత్రి శ్రీహరిని కలిసిన కాసుల



బాన్సువాడ : మంత్రిగా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన వాకిటి శ్రీహరిని సోమవారం ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం రేవంత్ రెడ్డి మంత్రి వర్గంలో బీసీ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్‌కు చోటు కల్పించడం హర్షనీయమని కాసుల బాల్‌రాజ్ అన్నారు. ఆయన వెంట ఆగ్రో ఎండీ శ్రీరాములు, జనరల్ మేనేజర్ యూనుస్ తదితరులు ఉన్నారు.

వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

- జిల్లా వ్యాప్తంగా 22 పైలట్ గ్రామాలు
- బేస్‌మెంట్ లెవల్ ఉన్న ఇళ్లకు బిల్లులు మంజూరు
- రూ.లక్ష చొప్పున నగదు జమ



పైలట్ గ్రామం నాగారంలో రూఫ్‌లెవల్ వరకు పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు

బాన్సువాడ : ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పైలట్ గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 26న ఇందిరమ్మ ఇంటి పథకాన్ని ప్రారంభించింది. మొదటగా మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి. ఆ గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటిని మంజురు చేసింది. బేస్‌మెంట్ స్థాయి వరకు నిర్మాణం పూర్తి చేసుకున్న తర్వాత రూ. లక్ష, వందశాతం పనులు పూర్తయిన వెంటనే రూ.5 లక్షలను లబ్ధిదారులకు చెల్లిస్తుంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 11284 ఇందిరమ్మ ఇళ్లు మంజురు అయ్యాయి. జిల్లాలో 22 పైలట్ గ్రామాల్లో 1808 మంది ఇళ్లను ప్రారంభించారు. ఇందులో 151 చోట్ల బేస్‌మెట్ వరకు పూర్తికావడంతో లబ్ధిదారులకు ప్రభుత్వం రూ. లక్ష చొప్పున నగదు బ్యాంకులో జమ చేసింది. మరో 20 ఇళ్లు రూఫ్ లెవల్ వరకు పూర్తయిన లబ్ధిదారులకు రెండో విడతలో మరో రూ. లక్ష చెల్లించారు. ప్రస్తుతం జిల్లాలో అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. పైలట్ గ్రామాల్లో 4250 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇందులో బేస్‌మెంట్ వరకు 141 ఇళ్లు, రూఫ్ లెవల్ వరకు ఇళ్లు, స్లాబ్‌లెవల్ వరకు ఒక్కటి పూర్తయింది. జిల్లాలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణ పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ పురోగతి సాధించేలా సంబంధిత అధికారులను ఆదేశాలు ఇస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇళ్ల పురోగతిపై నిత్యం ఆరా తీస్తున్నారు. ట్రాక్టర్ల యజమానులతో మాట్లాడి డీజిల్ ఖర్చులు తీసుకుని లబ్ధిదారులకు ఉచిత ఇసుకను తీసుకురావాలని సూచించారు. తాపీమేస్త్రీ యూనియన్ నాయకులతో మాట్లాడి తక్కువ ధరకు ఇళ్లను నిర్మించి ఇచ్చేందుకు చర్చలు జరిపారు. బేస్‌మెంట్, రూఫ్‌లెవల్ వరకు ఇంటి నిర్మాణం పూర్తయిన డబ్బులు రాని లబ్ధిదారులకు జమ చేసే ప్రక్రియ మొదలైంది.

జిల్లా వ్యాప్తంగా మంజూరైన ఇళ్లు	11,284
జిల్లాలో ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలు	4,250
పైలట్ గ్రామాల్లో బేస్‌మెంట్ లెవల్	151
రూఫ్ లెవల్	20

రూ. లక్ష జమ చేశారు



ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకోగా, అర్హత ఆధారంగా మంజురు చేయడం సంతోషంగా ఉంది. బేస్‌మెంట్ వరకు ఇంటి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రూ.లక్ష బ్యాంకు ఖాతాలో జమ చేశారు.

– రఘు, లబ్ధిదారు, నాగారం

స్లాబ్ పనులు ప్రారంభించాం



వర్షాకాలంలో ఇంట్లో చాలా ఇబ్బంది ఉండేది. దరఖాస్తు చేసుకున్న వెంటనే సర్కారు ఇందిరమ్మ ఇల్లును మంజురు చేసింది. రెండు విడతల్లో రూ. 2 లక్షల నగదు బ్యాంకులో జమ చేశారు. స్లాబ్ పనులు ప్రారంభించాం. మా కుటుంబానికి ఇల్లు మంజురు చేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– నాగరాజు, లబ్ధిదారు, నాగారం

చురుకుగా పనులు

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన తర్వాత బెస్‌మెట్ వరకు రూ. లక్ష, రూఫ్‌లెవల్ నిర్మాణాలకు మరో రూ. లక్ష లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేశాం. ప్రస్తుతం జిల్లాలో మేజర్ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయి.

– విజయ్‌పాల్ రెడ్డి, హౌసింగ్ పీడీ, కామారెడ్డి

ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులను చేర్పించాలి



అంకోల్ తండాలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు



దోమకొండలోని సీతారాంపల్లిలో..



లింగంపేట మండలం రాంపూర్‌లో..



కామారెడ్డి పట్టణంలోని..



వెల్లుట్లలో ..

దోమకొండ/నస్రుల్లాబాద్/లింగంపేట/ఎల్లారెడ్డిరూరల్/బీబీపేట/భిక్కనూరు/మాచారెడ్డి/కామారెడ్డి రూరల్ : జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో సోమవారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ వారు విద్యార్థుల తల్లితండ్రులను కలిసి మాట్లాడారు. ఇటీవల పదోతరగతి పరీక్ష ఫలితాల్లో దోమకొండ మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ఉపాధ్యాయులు వివరించారు. నస్రుల్లాబాద్ మండలం అంకోల్‌తండాలో, లింగంపేట మండలంలోని పలు గ్రామాల్లో, ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో, బీబీపేట మండలకేంద్రంలో, భిక్కనూరు మండలంలోని పలు గ్రామాల్లో, మాచారెడ్డి మండలం లచ్చాపేట గ్రామంలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కామారెడ్డి పట్టణంలో జెడ్పీహెచ్ఎస్ బాలికల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వై రమణారెడ్డి, ముదాం గల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఏ.బీ నగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యతో పాటు, యూనిఫాం, పుస్తకాలు, నోటు బుక్కులు, మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని ఆయా పాఠశాల హెచ్‌ఎంలు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

కళాశాల బాట నిర్వహించిన అధ్యాపకులు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కోమట్‌పల్లి, పోతాయిపల్లి, మెంగారం, బోనాల్ తదితర గ్రామాల్లో సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు కళాశాల బాట కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను కలిసి ప్రభుత్వ కళాశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యా బోధనపై అవగాహన కల్పించారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యా బోధన చేస్తున్నట్లు తెలిపారు. ఆధునిక పరికరాలతో సైన్స్ ల్యాబ్ సౌకర్యం ఉన్నట్లు వివరించారు. విద్యార్థుల ఇంటింటికి వెళ్లి అక్కడే అడ్మిషన్లు చేసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

బిచ్కుంద : మండల కేంద్రంలో రోడ్డు మురుగు కాలువలను ఆక్రమించుకుని అక్రమంగా చికెన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. సోమవారం ఈచికెన్ సెంటర్లనుమున్సిపల్ కమిషనర్ ఖయ్యూమ్ తొలగింపజేశారు. గతనెల 24న ఆర్‌అండ్‌బీ రోడ్డు, డ్రెయినేజీ ఆక్రమణ అనే శీర్షికతో వచ్చిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి చికెన్‌సెంటర్లకు నోటీసులు జారీ చేశారు. నాలుగైదు రోజుల్లో షెడ్లను తొలగించాలని ఆదేశించారు. షెడ్లను తొలగించకపోవడంతో సోమవారం మున్సిపల్ అధికారులు, పోలీసుల సహకారంతో ఆక్రమణలు తొలగించి రోడ్డు శుభ్రం చేశారు. మురికి కాలువలకు ఎత్తున మొరం వేయడంతో వర్షం నీరు కాలువలోకి వెళ్లకుండా రోడ్డుపై నిలుస్తోంది. రెండు రోజుల్లో మట్టి తొలగించి వర్షం నీరు మురికి కాలువలోకి వెళ్లే విధంగా చూడాలన్నారు. కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

- పంచాయతీ కార్యదర్శులు
- ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేత



నాగిరెడ్డిపేట ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నాగిరెడ్డిపేట/లింగంపేట(ఎల్లారెడ్డి): పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారికి సోమవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే లింగంపేటలో ఎంపీడీవోకు కార్యదర్శులు వినతిప్రతాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు సంబంధించి ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్న చెక్కులను వెంటనే క్లియర్ చేయాలన్నారు. గ్రామపంచాయతీలలో నిధులు లేక చెక్కులు జనరేట్ చేయని పెండింగ్ బిల్లుల వివరాలు సేకరించి వాటికి సంబంధించి గ్రామపంచాయతీలవారీగా నిధులను విడుదల చేయాలన్నారు. గ్రామపంచాయతీలలో ఉన్న ట్రాక్టర్ల నిర్వాహణకు అవసరమైన డీజిల్ ఖర్చులకు, తాగునీటి నిర్వాహణ, వీధిదీపాల నిర్వాహణతోపాటు ఇతర పారిశుద్య పనుల నిర్వాహణ కోసం నిధులను కేటాయించాలని వారు తెలిపారు. ఆన్‌లైన్ హాజరు విషయమై నిజామాబాద్, కరీంనగర్‌తోపాటు ఇతర జిల్లాలో డీపీవోలు జారీచేసిన షోకాజ్ మెమోలను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. విధి నిర్వాహణలో మృతి చెందిన కార్యదర్శులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు.

నేటి చిత్రం



ప్రమాదకరంగా ఉన్న సింగిల్ రోడ్డు మూలమలుపు

ప్రమాదకర మూలమలుపు

రామారెడ్డి: రామారెడ్డి మండల కేంద్రం నుంచి మద్దికుంట మర్రి వరకు 2017లో రూ.13 కోట్ల నిధులతో డబుల్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. రామారెడ్డి శివారులోని కట్టె డిపో సమీపంలో అటవీ ప్రాంతం ఉండడంతో డబుల్ రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. అదే ప్రాంతంలో మూలములవు ప్రమాదకరంగా ఉంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

– గర్గుల్ రాజాగౌడ్, రెడ్డిపేట, మాజీ ఎంపీటీసీ

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి



దరఖాస్తు తీసుకుంటున్న నస్రుల్లాబాద్ తహసీల్దార్ సువర్ణ



రాంచంద్రాపూర్‌లో.. తహసీల్దార్ గంగాసాగర్



కాస్లాబాద్ గ్రామంలో..



దేవునిపల్లిలో..

నస్రుల్లాబాద్/పెద్దకొడప్‌గల్/ఎల్లారెడ్డి/సదాశివనగర్/బాన్సువాడ రూరల్/భిక్కనూరు/ మద్నూర్/బీబీపేట : రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ సువర్ణ అన్నారు. సోమవారం నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. పెద్దకొడప్‌గల్ మండలం కాస్లాబాద్,వడ్లం గ్రామంల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ దశరథ్ పాల్గొని మాట్లాడారు. ఎల్లారెడ్డి మండలం దేవునిపల్లి, మౌళాన్‌ఖేడ్ గ్రామాలలో తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ సిబ్బందితో కలిసి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామంలో తహసీల్దార్ సత్యనారాయణ రెవెన్యూ సదస్సు నిర్వహించారు.బాన్సువాడ మండలం చిన్న రాంపూర్ గ్రామంలో నాయబ్ తహసీల్దార్ గంగాప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.భిక్కనూరు మండలం బస్వాపూర్, జంగంపల్లి గ్రామాల్లో తహసీల్దార్ సునీత రెవెన్యూ సదస్సులునిర్వహించారు. మద్నూర్ మండలం రుసెగావ్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 52, మేనూర్‌లో 27 మంది దరఖాస్తులు చేసుకున్నారని తహసీల్దార్ ముజీబ్ తెలిపారు.బీబీపేట మండలం రాంచంద్రాపూర్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ గంగాసాగర్ పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్లు, ఆర్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు



పర్మళ్లలో బోనాలు ఊరేగిస్తున్న గ్రామస్తులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల గ్రామంలో సోమవారం గ్రామస్తులు బోనాలు ఊరేగించారు. ఈ సందర్భంగా ఇంటింటికి బోనాలు తీసుకొని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బ్యాండు మేలాలు, డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలతో అంగరంగ వైభవంగా బోనాలు ఊరేగించారు. గ్రామ దేవతల ఆలయాల చుట్టు ఐదు సార్లు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాలు సమర్పించారు.

టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సంవృద్ధిగా కురవాలని, పాడి పంటలు పండాలని అమ్మవారిని కొలిచారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురేశ్

బీబీపేట: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ పార్టీని మరింత బలోపేతం చేయాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు సూరి సురేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రధానిగా 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్ష్మారెడ్డి, పోసు శివ, నారాయణ, మహేష్, నవీన్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

జూనియర్ కాలేజీకి బైపీసీ కోర్సు మంజూరు

భిక్కనూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బైపీసీ కోర్సును ప్రభుత్వం మంజూరు చేసిందని జిల్లా ఇంటర్ విద్యాధికారి షేక్ సలాం, ప్రిన్సిపల్ జ్యోతిర్మయి రాధాబాయి సోమవారం తెలిపారు. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య ఆదేశాలను జారీ చేశారని పేర్కొన్నారు. అలాగే బైపీసీ కోర్సును బోధించేందుకు అధ్యాపకులను కూడా నియమించారన్నారు.

ఘనంగా కల్కి భగవానుల భగవతి కల్యాణోత్సవం

కామారెడ్డి అర్బన్ : స్థానిక నిజాంసాగర్‌రోడ్డులోని శ్రీకల్కి భగవాన్ ఆలయంలో సోమవారం కల్కిభగవతి, భగవానుల కల్యాణ ఉత్సవాన్ని ప్రణయ దాసాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గణపతి, గౌరీ పూజలతో పాటు పాదుకా పూజోత్సవం భక్తి శ్రద్ధలతో చేశారు. దాతలు ఎల్లారెడ్డికి చెందిన డాక్టర నాగేశ్వరరావు, శ్రీఆర్యభట్ట కళాశాల యాజమాన్యం, లైఫ్ ఆసుపత్రి, వసుధ హోటల్, ఆర్కే విద్యాసంస్థలు, కామారెడ్డి న్యూరో ఆసుపత్రి యాజమాన్యాల ప్రతినిధులు, మ్యాడం వెంకటేష్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కల్కి ఆలయ ప్రతినిధులు చంద్రశేఖర్, బాలు, సూర్యకాంతం, దిగంబర్, పప్పుల శ్రావణి, జ్యోతి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

50 శాతం ఫీజు రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

కామారెడ్డి టౌన్ : ప్రైవేట్ స్కూళ్లలో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్ కోరారు. యూనియన్ ఆధ్వర్యంలో సాధించిన ఫీజు రాయితీ కలెక్టర్, డీఈవో ఉత్తర్వులను సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విడుదల చేశారు. సమాజ సేవలో ముందుంటున్న జర్నలిస్టులకు ఈఅవకాశాన్ని కల్పించడంపై ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పద్మాజీవాడిలో ప్రారంభంకాని బడిబాట

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజీవాడి ప్రాథమిక పాఠశాలలో ఇప్పటివరకు బడిబాట కార్యక్రమం ప్రారంభించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో 56 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. బడిబాట ప్రచారం లేకపోవడంతో ఉన్న 56 మంది విద్యార్థులు ప్రైవేట్ వైపునకు మొగ్గుచూపుతున్నారు. ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న శివలింగం ప్రతి రోజు నిజామాబాద్ నుంచి రావాల్సి ఉంటుంది. ఈ పాఠశాలలో పని చేస్తున్న మరో ఇద్దరు ఉపాధ్యాయులు రోజుకో పని అంటు కాలం వెళ్లదీస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులు లేకుంటే పాఠశాల మూతపడే దుస్థితి నెలకొంటుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యోగాతో మనసుకు ప్రశాంతత

బాన్సువాడ : యోగా చేయడంతోనే ప్రతి ఒక్కరి మనసుకు ప్రశాంతత కలుగుతోందని యోగా ప్రశిక్షకులు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025 పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆయుష్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు యోగాపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఆశ వర్కర్లకు యోగా ఆసనాలు వేయించారు. యోగాతో దీర్ఘకాలిక రుగ్మతలను దూరం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.